రెండో విడతకు సర్వం సిద్ధం

బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): కంటి వెలుగు రెండో విడతకు అన్ని ఏర్పాట్లు చేశామని, గురువారం నుంచి మున్సిపల్ పరిధిలో ప్రారంభిస్తామని బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి తెలిపారు. జిన్నారం మండలం బొల్లారం పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కంటి వెలుగు పరీక్షల నిర్వహణను బుధవారం ఆమె పరిశీలించారు. కంటి సమస్యలు ఉన్నవారు శిబిరాల్లో పరీక్ష చేయించుకోవాలని సూచించారు. జిన్నారంలో కంటి వెలుగు పరీక్షల తీరును డీఎల్‌పీఓ సతీష్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, సర్పంచ్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.


జిన్నారం: బొల్లారంలో కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రోజారాణి

న్యాల్‌కల్(జహీరాబాద్): రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను బుధవారం అధికారులు పరిశీలించారు. మిర్జాపూర్(బి) పీహెచ్‌సీ పరిధిలోని రుక్మాపూర్, రేజింతల్ తదితర గ్రామాల్లో జహీరాబాద్ డీఎల్‌పీఓ రాఘవారావు, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి తదితరులు పర్యటించి, ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు.

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం గురువారం పట్టణంలోని పాత ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణతో పాటు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా హాల్‌లో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.కృష్ణారెడ్డి తెలిపారు. చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, ప్రజలు పాల్గొనాలని కోరారు.

వంద రోజుల పాటు పరీక్షలు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో వంద రోజుల పాటు కంటి పరీక్షలు నిర్వహిస్తారని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ నెల19 నుంచి వచ్చే నెల 17 వరకు అమీన్‌పూర్ పట్టణంలో నేత్ర పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఉచితంగా పరీక్షలు చేసి కంటి అద్దాలను అందిస్తారన్నారు. కౌన్సిలర్లు, నాయకులు క్రియాశీలంగా వ్యవహరించి, అందరూ పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. కమిషనర్ సుజాత, మెడికల్ ఆఫీసర్ స్వాతి, కౌన్సిలర్ బాశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని వార్డు కార్యాలయంలో కంటి వెలుగు నిర్వహణపై అధికారులతో చర్చించారు. 18 ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరు శిబిరంలో కంటి పరీక్షలను చేయించుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఉప కమిషనర్ బాలయ్యను కోరారు. కార్యక్రమంలో కంటి వెలుగు ఇన్‌చార్జ్ డాక్టర్ నాగరాజకుమారి, నాయకులు బూరుగడ్డ నగేష్, మల్లేష్, ఖాన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

'కంటి వెలుగు' కేంద్రాల పరిశీలన

పటాన్‌చెరు టౌన్: జీహెచ్‌ఎంసీ సర్కిల్–22 పరిధిలో 18 ఏళ్ల పైబడిన వారందరు కంటి వెలుగు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య సూచించారు. బుధవారం పటాన్‌చెరు, రామచంద్రాపురం, భారత్ నగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాలను ఆయన పరిశీలించారు. డివిజన్‌లో లయన్స్ క్లబ్, బండ్లగూడ లోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం, రామచంద్రాపురంలో జీహెచ్‌ఎంసీ కార్యాలయం, మల్లిఖార్జున నగర్ కమ్యూనిటీ హాల్, కాకతీయ కమ్యూనిటీ హాల్, భారతి నగర్ ఎల్ఐజీ కమ్యూనిటీ హాల్‌లో కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆహ్వానం అందినవారు కంటి వెలుగు కేంద్రానికి వెళ్లాలని సూచించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య

ఖమ్మం సభతో గుణాత్మక మార్పు


ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో నాయకులు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ఖమ్మం సభ ద్వారా దేశ రాజకీయ వ్యవస్థలో గుణాత్మక మార్పు వస్తుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఖమ్మంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ భారీ బహిరంగ సభకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆయన ఖమ్మం సభకు తరలి వెళ్లారు. ఎన్డీఏ ప్రభుత్వం దేశంలో మతతత్వ రాజకీయాలకు పాల్పడుతోందని, ప్రతిపక్ష కాంగ్రెస్ ఉనికి కోసం పోరాటాలు చేస్తోందని ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో దేశ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్‌ను స్థాపించారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్ రెడ్డి, దశరథ్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, అంజయ్య యాదవ్, మాణిక్ రెడ్డి, నరసింహ, రాజేష్, కృష్ణకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభకు రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, శ్రీనివాస్, చౌదరి ప్రకాష్, సత్యంగౌడ్, శ్రీనివాస్, కోఆప్షన్ మెంబర్ ఖలీంపటేల్, మొబిన్, శివకుమార్, శ్రీశైలం, పట్టణ, మండల అధ్యక్షులు చీలమల్లన్న, పెద్దగొల్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు నాయకులు ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు.

ఖేడ్ నుంచి..

నారాయణఖేడ్: ఖమ్మంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ బహిరంగ సభకు ఖేడ్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు వాహనాల్లో తరలివెళ్ళారు. పార్టీ కండువాలు వేసుకుని, సీఎం కేసీఆర్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ వాహనాల్లో బయల్దేరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, రమేష్ చౌహాన్, రవీందర్ నాయక్, సత్యపాల్‌రెడ్డి, ప్రభాకర్ ఉన్నారు.


ఖేడ్ నుంచి తరలుతున్న బీఆర్‌ఎస్ నాయకులు


సదాశివపేట నుంచి..

సీఎం సభలో జహీరాబాద్ నేతలు

జహీరాబాద్: ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ సభకు జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు తరలివెళ్లారు. రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, జహీరాబాద్, అందోల్ ఎమ్మెల్యేలు కె.మాణిక్‌రావు, క్రాంతి కిరణ్, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్ సభలో పాల్గొన్నారు.


సభలో చింతా ప్రభాకర్, అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తదితరులు

క్రీడల కేంద్రంగా మైత్రి మైదానం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పట్టణంలోని మైత్రి క్రీడా మైదానం భవిష్యత్‌లో క్రీడలకు కేంద్రంగా మారుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని మైత్రి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రూ.7.50కోట్లతో మైత్రి క్రీడా మైదానాన్ని అత్యాధునిక వసతులతో ఆధునీకరించామని, ఏడాది పొడవునా క్రీడలు నిర్వహించేలా రూపొందిస్తున్నామని తెలిపారు. త్వరలోనే మైత్రి క్రికెట్ క్లబ్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించేందుకు కృషిచేస్తామన్నారు. నియోజకవర్గంలో క్రీడల అభివద్ధికి ఐదెకరాల విస్తీర్ణంలో మూడు మినీ స్టేడియాల నిర్మాణ పనులు చేస్తున్నామని, గ్రామీణ క్రీడాకారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, వెంకట్ రెడ్డి, క్లబ్ కమిటీ ప్రతినిధులు, పుర ప్రముఖులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడపాలి

జహీరాబాద్ టౌన్: గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం జహీరాబాద్ డిపో మేనేజర్ రజనీ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జహీరాబాద్ కార్యదర్శి రాజేశ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్య కోసం పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని, ఆర్టీసీ బస్సులు లేక ప్రతీ రోజు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారని వాపోయారు. గతంలో రెండు మూడు ట్రిప్పులు నడిచే రూట్‌లో ప్రస్తుతం బస్సు సర్వీసు నడవడంలేదని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బిలాల్‌పూర్, కవెలి, చంతల్‌ఘాట్ రూట్‌లో అదనపు బస్సులు నడపాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం నాయకులు చంద్రవర్ధన్, రాఘవేంద్ర, మల్లేష్, దుర్గప్రసాద్, శివకుమార్, అతీక్, సాయిలు ఉన్నారు.

అంగన్‌వాడీ ఆయాలకు శిక్షణ

ఝరాసంగం(జహీరాబాద్): ఝరాసంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాల అంగన్‌వాడీల ఆయాలకు అజీమ్ ప్రేమ్‌జీ సంస్థ సహకారంతో బుధవారం అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్రం ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని, చిన్నారులకు ఆటా, పాటలను నేర్పించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సునీత పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి రమణ, ఆయా గ్రామాల అంగన్‌వాడీల ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.


ఆయాలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సునీత

క్షేత్రస్థాయిలో బలోపేతం చేద్దాం

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గీతారెడ్డి

జహీరాబాద్: క్షేత్రస్థాయి నుంచి కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేద్దామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గీతారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జహీరాబాద్‌లో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీని పటిష్టం చేసేందుకు రాహుల్‌గాంధీ నేతృత్వంలో భారత్ జోడోయాత్ర కొనసాగిందన్నారు. అదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో హాత్‌సే హాత్ జోడో యాత్ర చేపట్టేందుకు అధిష్ఠానం నిర్ణయించిందన్నారు. నాయకులకు పదవులు శాశ్వతం కాదని, ప్రజా సేవే లక్ష్యంగా భావించి ముందుకు సాగాలని సూచించారు. ఈనెల 26 నుంచి గ్రామ గ్రామానా కార్యక్రమాలు చేపడుతామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం పంచాయత్‌రాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ధరణి పేరుతో రైతులను దగా చేస్తోందని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ ప్రజల సమస్యలు గాలికొదిలి బీఆర్‌ఎస్ పేరుతో రాజకీయాలు చేయడాన్ని తప్పుపట్టారు. అధికారులు ప్రభుత్వానికి తొత్తులుగా మారారని.. డబ్బులు ఇవ్వనిదే పనులు కావడం లేదని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిశెట్టి రాథోడ్, ఎంపీపీ మాధవి, ఆయా మండలాల పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కండెం నర్సింహులు, రామలింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గీతారెడ్డి

పైప్‌లైన్ లీక్... వృథాగా నీరు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో వివిధ ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకేజీల కారణంగా మంచి నీరు వృథాగా పోతోంది. ఇంటింటా తాగునీరు అందించేందుకు ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తుంటే అధికారుల నిర్లక్ష్యంతో నీరంతా వృథా అవుతోంది. నెల రోజులుగా అమీన్‌పూర్ త్రిపుర టీచర్స్ కాలనీ రోడ్డుపై పైప్‌లైన్ లీకై నీరు పోతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. లైన్‌మెన్‌కు సమస్యను తెలిపినా పరిష్కరించలేదని కాలనీవాసులు ఆరోపించారు. పైప్‌లైన్ లీకేజీతో నీరంతా రోడ్డుపై పారడంతో రోడ్డుపై గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎర్పడుతున్నాయి. అమీన్‌పూర్, చందానగర్ నుంచి బీరంగూడ టెంపుల్‌కు వెళ్లే దారి నిత్యం రద్దీగా ఉండడం, రోడ్డుపై నీరు పారుతుండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై వాటర్ వర్క్స్ ఏఈ అమీరుద్దీన్‌ను వివరణ కోరగా.. సమస్య తన దృష్టికి రాలేదని, వెంటనే చర్యలు తీసుకుంటానని తెలిపారు.


లీకేజీతో రోడ్డుపై పారుతున్న నీరు

క్రీడలతోనే మానసిక, శారీరక దృఢత్వం

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. బుధవారం చిలప్‌చెడ్ ఫైజాబాద్ గ్రామంలో ఎంపీపీ వినోదరెడ్డి, స్థానిక సర్పంచ్ మనోహర రెడ్డితో కలిసిన టెంట్ హౌస్‌ను ప్రారంభించారు. అనంతరం సునీతారెడ్డి కుమారుడు శశిధర్‌రెడ్డితో కలసి గ్రామ యువకులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అశోక్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, జిల్లా రైతు సమన్వయ సభ్యుడు సయ్యద్‌హుస్సేన్, కో ఆప్షన్ సభ్యుడు షఫీ, నాయకులు గోపాల్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, సంగాగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ముకుందారెడ్డి, నర్సింహ్మారెడ్డి, విఠల్, గోపాల్‌రావు, భీమయ్య, వీరస్వామి, గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.


కిట్లు అందిస్తున్న సునీతారెడ్డి, తదితరులు

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కార్యాచరణ

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ముందుకు సాగేందుకు అవసరమైన కార్యచరణ కోసం యూత్ జోడో బూత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం చిన్నశంకరంపేటలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గ్రామ గ్రామాన బూత్‌కు ఐదుగురు సభ్యులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేసి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణ, ఓయూ జేఏసీ నాయకుడు మోహన్‌నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్, మండల యూత్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, రవిచంద్, వెంకట్‌గౌడ్, పద్మారావు, శ్రీను, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నేటి నుంచి కంటివెలుగు**

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ప్రారంభిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్ తెలిపారు. మున్సిపల్ పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, నాయకులు అధిక పాల్గొనాలని కోరారు.

◆ **24న ఖేడ్ మండల సమావేశం**

నారాయణఖేడ్: ఖేడ్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీ చాందీబాయి చౌహాన్ అధ్యక్షతన ఉదయం 11.30గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

◆ **నేడు సాయిబాబా ఆలయంలో పూజలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని ఇశ్రితాబాద్ శివారు సాయిబాబా ఆలయంలో గురువారం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రజలు, భక్తులు స్వామివారిని దర్శించుకొని ఆశీస్సులు పొందాలని కోరారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ అడ్మిషన్ల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నజీబ్ అహ్మద్ ఖాన్ తెలిపారు. 2023- 24 సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ లోగా కళాశాలలో దరఖాస్తులను సమర్పించాలని అన్నారు. టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. కళాశాలలో విద్యతోపాటు, హాస్టల్, భోజనం తదితర సదుపాయాలు ఉంటాయని, వివరాలకు 86867 09950, 82470 58451 సంప్రదించాలన్నారు.

◆ **జాతరకు రానున్న రాజనర్సింహ**

మునిపల్లి(అందోల్): మండలంలోని చిన్నచల్మెడ జాతరకు ఈ నెల 20న మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ వస్తున్నట్లు మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి బుధవారం తెలిపారు. దుర్గమ్మ ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఉదయం11.30 గంటలకు ఆయన ఆలయానికి రానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని గ్రామాల కాంగ్రెస్ నాయకులు హాజరుకావాలని కోరారు.

◆ **తప్పిపోయిన గేదె**

జోగిపేట(అందోల్): సుమారు నెల రోజుల క్రితం ఓ గేదె తప్పిపోయి అందోలు మండలం చింతకుంట గ్రామంలోకి వచ్చిందని, గేదె యజమానులు వచ్చి తీసుకెళ్లాలని సర్పంచ్ మమత తెలిపారు. గేదెను పంచాయతీ కార్యాలయం వద్ద కట్టి ఉంచామని, చుట్టు ప్రక్క గ్రామాల్లో గేదె యజమానులు తమను సంప్రదించాలన్నారు. 94927 28222 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

◆ **ఎన్టీఆర్‌కు నివాళి**



నారాయణఖేడ్: ఖేడ్‌లో మాజీ సీఎం ఎన్టీ రామారావు 27వ వర్ధంతిని అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన అర్థం విశ్వనాథ్, బాలాగౌడ్, రమేష్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి, నివాళులర్పించారు. సీఎంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

◆ **పటాన్‌చెరులో కూరగాయల ధరలు**

పటాన్‌చెరుటౌన్: కిలోకు రూ.లలో...
టమాటా–20, కాకరకాయ–40, ఆలుగడ్డ–30, క్యారెట్–40, బీట్ రూట్–40, వంకాయ–50, పచ్చిమిర్చి–50, ఉల్లిగడ్డ–20, బెండకాయ–60, క్యాబేజి–30, బీరకాయ–60, చిక్కుడుకాయ –60, బీన్సీస్ –50, నిమ్మకాయలు(4)–10, దోసకాయ–50, చామగడ్డ –50ల ధర ఉంది.

క్లుప్తంగా

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి


మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సహకారంతో పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో హిందు, ముస్లిం, క్రిస్టియన్లకు వేర్వేరుగా శ్మశాన వాటికలకు స్థలం కేటాయించి, అభివృద్ధి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని బండ్లగూడలో నేతజీ నగర్ శ్మశాన వాటికను సందర్శించి, పరిసరాలను శుభ్రం చేయించారు. కాలనీ వాసులతో మాట్లాడి త్వరలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయిస్తానని తెలిపారు.

పంచలోహ కవచాల వితరణ


పంచలోహ కవచాలను అందిస్తున్న విజయ్‌బుజ్జి

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని శాస్త్రీనగర్ గడిమైసమ్మ ఆలయానికి ఖేడ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, సామాజికవేత్త విజయ్‌బుజ్జి పంచలోహ కవచాలను అందించారు. బుధవారం ఆలయ కమిటీ బాధ్యులకు అప్పగించారు. కార్యక్రమంలో కాలనీపెద్దలు సుదర్శన్, మశ్చేందర్, శివకుమార్, వెంకటేష్, శ్రీనివాస్, రమేష్ తదితరులు ఉన్నారు.

పత్తికి మద్దతు ధర కల్పించాలి


వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట ప్రాంతంలో పత్తి వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరను తగ్గించారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.తాజోద్దీన్ ఆరోపించారు. వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో నాయబ్ తహసీల్దార్ విష్ణుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్వింటాల్ పత్తి రూ.9 వేలకు కొనాల్సి ఉండగా, వివిధ కారణాలతో ధర తగ్గించి రూ.7 వేలకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దళారుల ప్రమేయం లేకుండా కనీస మద్దతు ధర రూ.15 వేలు అందించి పత్తిని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎండీ.షఫీ, మండల కార్యదర్శి శంకరప్ప, నాయకులు రాములు, సయ్యద్ అజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


సేంద్రియ ఎరువులు వాడాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు సాధ్యమైనంత వరకు సేంద్రియ ఎరువులనే వాడాలని సర్పంచ్ అశోక్‌గౌడ్ అన్నారు. బుధవారం చిలప్‌చెడ్ మండలం అంతారం గ్రామంలో గల పలువురు రైతులకు సర్పంచ్ సహస్ర లైఫ్ సైన్స్ వారి సేంద్రియ ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సహస్ర లైఫ్ సైన్స్ ఏరియా మేనేజర్ వీరేశం, అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. తరచూ రసాయన ఎరువులు వాడకంతో నేల సారవంతాన్ని కోల్పోతుందన్నారు. కార్యక్రమంలో గణేష్, వార్డు సభ్యుడు చెన్నయ్య, రైతులు కొమురయ్య, శ్రీశైలం, సత్యనారాయణ గౌడ్, రాజు లచ్చయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలంలో ఉన్న ఏడు ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న పదవ తరగతి విద్యార్థులకు ఐకేపీ ఆధ్వర్యంలో బుధవారం స్నాక్స్ పంపిణీ చేశామని ఏపీఎం ప్రేమలత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్ ఉండడంతో ఐకేపీ ఆధ్వర్యంలో వారికి ప్రతి రోజూ విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేస్తామన్నారు. కార్యమంలో ఐకేపీ సీసీ పురుషోత్తం, ఉపాధ్యాయ సిబ్బంది రమేశ్, రుక్మిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం


పుష్పార్చనలో మహిళలు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని శ్రీ శీతలమాత (నల్లపోచమ్మ) ఆలయ 7వ వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభయ్యాయి. ఉత్సవాలు మూడు రోజులపాటు జరగనున్నాయి. ఉత్సవాలలో భాగంగా లక్ష పుష్పార్చన జరిగింది. మహిళలు భారీగా పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేశారు.